క్లుప్తంగా

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆరుగురు సివిల్ విభాగం విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్ 2024లో పూర్తి చేయబోతున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించమన్నారు. అనూష ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ కన్స్ట్రక్షన్‌లో ఉద్యోగాలు సాధించారన్నారు. విద్యార్థులకు ఏడాదికి రూ. 2.5లక్షల పైగా వేతనం ఉంటుందని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ ముత్తవరపు శ్రీనివాస బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు విద్యార్థులను అభినందించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.బాలకృష్ణ, ముత్తవరపు రామకృష్ణ పాల్గొన్నారు.

ఆయుర్వేద దినోత్సవం

పాయకాపురం(విజయవాడరూరల్): ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాయకాపురం, రాజీవ్‌నగర్లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో ఆయుర్వేద దిన వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నెల రోజుల పాటు ప్రతిరోజూ అందరికీ ఆయుర్వేదం అనే నినాదంతో ఘనంగా వేడుకలు జరుపుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆరోగ్య సంరక్షణలో ఆయుర్వేద వైద్యం ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. అనంతరం సీనియర్ పరిశోధన అధికారి డాక్టర్ జీవీ సాయిప్రసాద్ మాట్లాడుతూ ఆయుర్వేద ప్రదాత ధన్వంతరి అని ఆయుర్వేద దినోత్సవం యొక్క ప్రాధాన్యతను తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్కూల్ గేమ్స్ చెస్ పోటీలకు ఎంపిక



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ అకాడమీకి చెందిన విద్యార్థి అవ్వారు విజయ్‌కుమార్ రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన సిద్ధార్థ కాలేజ్‌లో చెస్ టోర్నమెంట్ జరిగింది. ఇందులో తమ విద్యార్థి మూడవ స్థానం సాధించడంతో పాటు రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఎ.రామకృష్ణ తెలిపారు. విజయ్‌కుమార్ చదువుతున్న గూడవల్లిలోని శ్రీచైతన్య విద్యా సంస్థల డీన్ కె.శరత్‌బాబు విద్యార్థిని మంగళవారం సన్మానించి అభినందనలు తెలిపారు. విజయ్‌కుమార్ ఇలానే మరిన్ని పతకాలు సాధించి తమ కళాశాలకు, నగరానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

ఉత్సాహంగా భగవద్గీత శ్లోకాల పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు భారతీయ విద్యా మందిర్ పాఠశాలలో చిన్మయ మిషన్ ఆధ్వర్యాన భగవద్గీత శ్లోకాల పోటీలు జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్మయ మిషన్ సభ్యుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో భగవద్గీత పఠనం పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు దోహద పడతాయన్నారు. విద్యార్థులు నిత్యం భగవద్గీతను చదవటంతో పాటు ధర్మ మార్గాన్ని అనుసరించాలని సూచించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా లక్ష్మీనారాయణ, సావిత్రి , హేమలత వ్యవహరించారు.

చిన్నారులకు ఖురాన్ కంఠస్థ పోటీలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దైవ గ్రంథం ఖురాన్ ఔన్నత్యాన్ని అందరికీ తెలియజేసేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ మహమ్మద్ దావూద్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఏడాదికూడా పాఠశాల స్థాయి నుంచి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రామ స్థాయి నుంచి ఈ పోటీలు జరుగుతాయన్నారు. అనంతరం పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫోరం ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

- పాలనలో విప్లవాత్మక సంస్కరణలు
- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాలను తీసుకువచ్చి రాష్ట్ర రాజకీయాల్లో పరిపాలన పరంగా అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 26వ డివిజన్ 30వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, డివిజన్ ఇన్‌చార్జి అంగిరేకుల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అందజేసిన ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

సంక్షేమ జాబితాతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. ఎన్నికల్లో గెలిచిన ప్రజా ప్రతినిధులు ఇలా ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం అనేది ఆంధ్రప్రదేశ్‌లోనే సాధ్యమైందని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. దారి పొడవునా మహిళలు, లబ్ధిదారులు హారతులు ఇస్తూ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.

నవరత్నాలతో..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తీసుకొచ్చారని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. పేదరికమే ప్రామాణికంగా తీసుకొని పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. మధ్యవర్తులు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమవుతున్నాయని చెప్పేందుకు గర్వంగా ఉందన్నారు. ఒక్క 30వ వార్డు సచివాలయ పరిధిలోనే అక్షరాల రూ.7,94, 6, 381 సంక్షేమాన్ని అందజేసినట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు వెల్లడించారు.

పేదల సొంతింటి కల సాకారం

పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ 110 మందికి సచివాలయ పరిధిలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. చంద్రబాబు అండ్ కో వేసిన కేసుల కారణంగా సెంట్రల్లో 7,211 మంది పేదల ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయినట్లు వెల్లడించారు. న్యాయస్థానాల అంగీకారంతో వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టి.. పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

పేదలకు మంచి జరుగుతుంటే ఓర్వలేరా..?

సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడే అర్హత విపక్షాలకు ఏ మాత్రం లేదని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి చంద్రబాబు పేదలకు ఏం మంచి చేశారు..? అని సూటిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని నియోజకవర్గంపై ఈ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే అన్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి వ్యవస్థ, అర్బన్ హెల్త్ సెంటర్లు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, ఆర్.యు.బి.లు, ఆర్.ఓ.బి.లు, విద్యుత్ సబ్ స్టేషన్లు.. ఇలా నిత్యం అభివద్ధి కార్యక్రమాలతో నియోజకవర్గం కళకళలాడుతోందని చెప్పారు. వీఎంసీ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి



తొలి పూజను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ ఆయురారోగ్యాలతో నిండునూరేళ్లు సంతోషంగా జీవిస్తూ ప్రజలకు మరింత సుపరిపాలన అందించాలని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ఆకాంక్షించారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్లో సమత మమత యూత్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 24 వరకు జరగనున్న శ్రీ కనక దుర్గా అమ్మవారి దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలకు సంబంధించిన తొలి పూజా రాట కార్యక్రమం మంగళవారం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సింగ్‌నగర్ ప్రాంతం మినీ భారతదేశంలా మారుతుందని కుల, మతాలకు అతీతంగా ఈ ప్రాంతం దినదినాభివృద్ధిని సాధిస్తుందన్నారు. అమ్మవారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా, వైఎస్సార్ సీపీ నేతలు ఎండీ హఫీజుల్లా, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపించకుంటే చర్యలు



మాట్లాడుతున్న ఏపీఐడీసీ చైర్ పర్సన్ పుణ్యశీల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీఐడీసీలో ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశానని తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలని ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల టీడీపీ మాజీ కార్పొరేటర్ హనుమంతరావుకు సవాల్ విసిరారు. రుజువు చేయాలని, లేనిపక్షంలో పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడ్కో ఇళ్లు ఇప్పిస్తామని పేదల నుంచి డబ్బులు వసూలు చేసిన కేసులో ప్రధాన సూత్రధారైన హనుమంతరావు తనపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ కేసులో ఇప్పటికే అరెస్టయిన హబీబ్ ఇచ్చిన వాంగ్మూలంలో హనుమంతరావు ప్రధాన సూత్రధారని చెప్పాడన్నారు. లేనిపోని ఆరోపణలతో తనపై బురద జల్లాలని ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరం



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేద ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. నియోజకవర్గంలో తొమ్మిది మందికి మంజూరైన రూ.6.17 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని తన కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, వైద్య రంగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, 104 వాహనాల ద్వారా ప్రతి గడపకూ అత్యాధునిక వైద్యం అందుతోందన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రానికి ఒక్క మెడికల్ కళాశాలను కూడా తీసుకురాలేదని.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.8 వేల కోట్లకు పైగా నిధులతో 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దాదాపు 3,200 సేవలను ఈ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చినట్లు మల్లాది విష్ణు పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 1,69,376 లక్షల కుటుంబాలకు గానూ.. ఇప్పటివరకు 71,982కుటుంబాలకు రూ.160 కోట్లతో ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందించినట్లు గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద వర్తించని రోగాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యం చేయించుకోవచ్చని వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు చేయూతనిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే మల్లాది విష్ణుకి లబ్ధిదారుల కుటుంబసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా, వైసీపీ కార్పొరేటర్ శర్వాణిమూర్తి పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం'



లెమన్ అండ్ స్పూన్ ఆటలో పోటీ పడుతున్న విద్యార్థులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సింగ్‌నగర్ వివేకానంద ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ సంతోషమైన జీవితానికి తొలిమెట్టు మానసిక ఆరోగ్యమే అని, ఇది బాగుంటే మనలో ఆత్మవిశ్వాసం వెన్నంటే ఉంటుందన్నారు. మానసిక బలం సాధించడం వల్ల ప్రతికూల పరిస్థితులను సైతం అధిగమించే ఆత్మస్థైర్యం మనలో తొణికిసలాడుతుందని, మనలో ఒత్తిడి ఆమడ దూరం పారిపోతుందని తెలిపారు. ఏ వయస్సు వారిలో అయినా మానసిక ఆరోగ్య సమస్యలు ఎక్కువగా కనిపిస్తే వారిని వెంటనే నీతోడు మానసిక వికాస కేంద్రం మీకు తోడుగా ఉంటుందని పేర్కొన్నారు. పెజ్జోనిపేటలోని ఈ కేంద్రంలో సైక్రియాటిస్టు, క్లినికల్ సైకాలజిస్టు అందుబాటులో ఉంటారని వివరించారు. వివేకానంద ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సితేపల్లి నరేంద్ర మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా, ఉల్లాసంగా ఉండటమే ఆరోగ్యమని, ఇలాంటి అవగాహనా కార్యక్రమాల వలన విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం మరింత మెరుగుపడుతుందన్నారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్ ఎస్‌కె నజ్మా, ఎస్ జాకబ్ రాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనసు వేదనను గుర్తించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మనసు వేదనను ఆరంభ దశలోనే గుర్తించి నయం చేయవచ్చని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణకుమారి అన్నారు. స్థానిక అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక సమస్యలపై అపోహలు వీడాలన్నారు. మానసిక సమస్యలు గుర్తించిన వెంటనే కుటుంబ సభ్యులతో పంచుకోవాలని సూచించారు. చేయూత మానసిక వికలాంగుల శిక్షణాసంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు పీఎం స్వనిధి రుణాల మంజూరు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలకసంస్థ పరిధిలో వీధి విక్రయదారులకు పీఎం స్వనిధి రుణాల మంజూరుకు నిర్వహించిన క్రెడిట్ క్యాంపునకు అనూహ్యమైన స్పందన లభించిందని వీఎంసీ పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి కె.శకుంతల తెలిపారు. నగర వ్యాప్తంగా మూడు సర్కిళ్లలో నిర్వహించిన ఈ క్రెడిట్ క్యాంపులో మొత్తం 1,476 మందికి రుణాలు మంజూరు చేశామన్నారు. సర్కిల్-1 పరిధిలో 455 మందికి, సర్కిల్-2 పరిధిలో 545 మందికి, సర్కిల్-3 పరిధిలో 476 మందికి రుణాలు మంజూరయ్యాయన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకోని ఆర్థికాభివృద్ధి చెందాలని సూచించారు.

ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇటీవల నాక్ ఏ గ్రేడ్ సాధించింది. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యాన మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ.. కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మిని సత్కరించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రశంసా పత్రం, జ్ఞాపికను ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సుధాకర్, డాక్టర్ జె.నాగేశ్వరరావు, డాక్టర్ డి.బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత ఆధ్వర్యంలో ర్యాలీలో వక్తలు



ర్యాలీలో పాల్గొన్న ఆదాయపు పన్ను శాఖ విజయవాడ సర్కిల్-1 డెప్యూటీ కమిషనర్ ఏ.తాండవ కృష్ణమూర్తి.

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రస్తుతం మొక్కలు నాటితేనే భవిష్యత్ తరాలకు చక్కటి పర్యావరణాన్ని అందించగలరని ఆదాయపు పన్ను శాఖ విజయవాడ సర్కిల్-1 డెప్యూటీ కమిషనర్ ఏ.తాండవ కృష్ణమూర్తి చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత, పానసోనిక్ డిజిటల్ స్టోర్స్, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ ర్యాలీ మంగళవారం జరిగింది. మారుతీనగర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఏలూరు రోడ్డు మీదుగా ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల వరకు సాగింది. తాండవ కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటి ర్యాలీలో పాల్గొన్నారు.

మొక్కలను నాటడంతో పాటు సంరక్షించాలి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షిస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. ఆ విషయాన్ని గుర్తించి లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత వారు చేస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దానిని పరిరక్షించాలని చెప్పారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. తమ కళాశాల ఆవరణలో పచ్చదనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని చెప్పారు. లయన్స్ క్లబ్ మల్టిపుల్ మాజీ చైర్మన్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ విశ్వంలో మొదట ఉన్నవి చెట్లేనన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేపట్టాల్సిన బాధ్యత మనుషులందరిపై ఉందన్నారు. పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ హెడ్ సీహెచ్‌ఎం.నాగ వాసు, పానసోనిక్ డిజిటల్ స్టోర్స్ అధినేత ఎల్.రామకృష్ణ మాట్లాడుతూ సమాజానికి మంచి చేసే ఎలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడానికి అయినా తాము ముందుంటామన్నారు. లయన్స్ జోన్ చైర్మన్ ఎస్.నిరంజన్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు, కార్యదర్శి కె.ఫణీంద్ర బాబు, కోశాధికారి కె.వెంకటేశ్వరరావు, లయన్స్ యోగా కో-ఆర్డినేటర్ అంకాల సత్యనారాయణ, సభ్యులు బెల్లంకొండ శ్రీనివాస ప్రసాద్, పొన్నాడ ఈశ్వరాచారి (సిద్ధాంతి)తో పాటుగా ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత సభ్యులు పాల్గొన్నారు. సభ అనంతరం మారుతీనగర్ అంతర్గత రహదారుల్లో మార్జిన్స్‌లో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ర్యాలీ ఉత్సాహంగా సాగింది.

నిరాశ్రయులకు ఆవాసం కల్పించేందుకు వీఎంసీ చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ శకుంతల

పటమట(విజయవాడతూర్పు): నిరుపేదలు వివిధ రకాల కారణాలతో నగరానికి వచ్చి ఉంటున్న వారికి ఆవాసాన్ని కల్పించేందుకు వీఎంసీ చర్యలు తీసుకుంటుందని వీఎంసీ అదనపు కమిషనర్(జనరల్), పట్టణ సమాజికాభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి కె.శకుంతల తెలిపారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 36వ డివిజన్‌లోని హనుమాన్ పేట నిరాశ్రయుల వసతి గృహంలో ఆదర్శ రూరల్ హెల్త్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. వీఎంసీ ఆధ్వర్యంలో నాలుగు నిరాశ్రయుల వసతి గృహాలను నిర్వహిస్తున్నామని, వివిధ పనులతో నగరానికి వచ్చినపుడు ఈ నిరాశ్రయుల వసతి గృహాలను వినియోగించుకోవచ్చునన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వసతి, మరుగుదొడ్లు వంటి కనీస అవసరాలను ఈ వసతి గృహాల్లో పొందవచ్చని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు మరింత అంకిత భావం తో పని చేయాలని, నైట్ డ్రైవ్స్ నిర్వహించి, ఎక్కువ మంది ఈ వసతి గృహాలను వినియోగించుకునే విధంగా చూడాలని సూచించారు. బస చేసే వారు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌హెచ్‌డీఎస్ పీడీ రామకష్ణ, సర్కిల్-3 సీడీవో జగదీశ్వరి, మెప్మా కో ఆర్డినేటర్ మహాలక్ష్మి, సోషల్ వర్కర్ నాగరాజు, రూట్స్ హెల్త్ ఫౌండేషన్, షెల్టర్ నిర్వాహకులు, కేర్ టేకర్స్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఇంటా సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రతి కుటుంబంలో సంపూర్ణ ఆరోగ్యం ఉండేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా 26 డివిజన్ మారుతీనగర్‌లో మంగళవారం వైద్య సిబ్బంది ఎమ్మెల్యేకి పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది సహకారంతో కొనసాగుతున్న సర్వేకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. క్యాంపుల్లో కంటి సమస్యలు, షుగర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పేషంట్ల సమస్య తీవ్రతను బట్టి ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. అజిత్‌సింగ్ నగర్‌లో ఎం.కె.బేగ్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవలసిందిగా ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ నాయకులు అంగిరేకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సాంస్కృతిక మహోత్సవాలు



నృత్యం చేస్తున్న కళాకారులు



మహిళల కోలాటం

దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు నృత్య సంగీత కళాశాలలో దసరా సాంస్కృతి మహోత్సవాలు మంగళవారం నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. దసరా సాంస్కృతిక మహోత్సవ కమిటీ, మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సాంస్కృతిక మహోత్సవాలు జరగనున్నాయి. కోలాటం, జానపద, శాస్త్రీయ నృత్యాల పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఓటు ప్రాముఖ్యతను తెలిపేలా మార్టిన్ లూథర్‌కింగ్ మూవీ



ఎల్ఈపీఎల్‌లో ఓటు ప్రాముఖ్యతను వివరిస్తున్న సినిమా బృందం

పటమట(విజయవాడ తూర్పు): మార్టిన్ లూథర్ కింగ్ మూవీ టీమ్ విజయవాడ నగరంలో మంగళవారం సందడి చేసింది. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా హీరో సంపూర్ణేష్ బాబు, దర్శకులు పూజ, వెంకటేష్ మహాలు నగరంలోని ఎల్ఈపీఎల్‌లో ప్రదర్శించిన ప్రీమియర్ షోకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రేక్షకులతో కలిసి వారు సినిమాను చూశారు. అనంతరం ప్రేక్షకుల అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హీరో సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ మార్టిన్ లూథర్ కింగ్ మూవీ రీమేక్ మూవీ అయినప్పటికీ తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా తెరకెక్కించామన్నారు. ఓటు ప్రాముఖ్యత గురించి ప్రజలకు చాటి చెప్పామన్నారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తోందన్నారు. రానున్న రోజుల్లో మంచి కంటెంట్ ఉన్న సినిమాలను నిర్మిస్తామని తెలిపారు.